
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




బంద్‌లో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులు


సిద్దిపేట జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న బీసీ న్యాయవాదులు

సిద్దిపేటలో బంద్ పాక్షికం

• కోర్టు ఎదుట బీసీ న్యాయవాదుల నిరసన

సిద్దిపేట క్రైం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో సిద్దిపేటలో సోమవారం నిర్వహించిన బంద్ పాక్షికంగా ముగిసింది. బీసీ సంఘాల నాయకులు ఉదయం పూట ప్రధాన రోడ్ల గుండా తిరుగుతూ దుకాణాలను మూయించారు. అనంతరం సిద్దిపేట పాత బస్టాండ్ చౌరస్తాలోని పూలే, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత వ్యాపారవేత్తలు దుకాణాలను తెరిచి ఉంచారు. బంద్ సందర్భంగా ఎక్కడ అల్లర్లు జరగకుండా పోలీసులు సిద్దిపేట జిల్లా కేంద్రంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ బంద్‌లో బీసీ నాయకులు పార్టీలకు అతీతంగా పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ సిద్దిపేట బీసీ న్యాయవాదుల ఆధ్వర్యంలో కోర్టు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ ప్రధాన కార్యదర్శి, బీసీ న్యాయవాది తాటికొండ రమేష్ మాట్లాడుతూ, జనాభా ప్రకారం బీసీలకు రావాల్సిన వాటా ఇవ్వాలని, తక్షణమే పార్లమెంటులో అన్ని రాజకీయ పార్టీలు బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపచేయాలన్నారు. దేశంలో కొన్ని రాష్ట్రాల్లో ఏ విధంగా బీసీలకు అధిక రిజర్వేషన్ కల్పించారో, అదే విధంగా తెలంగాణలో కూడా కల్పించాలన్నారు. లేనిపక్షంలో ప్రజాకోర్టులో అన్ని రాజకీయ పార్టీలకు ప్రజలే బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు సాయిబాబా, గొడుగు రాజేష్, గుడాల నరేష్, కార్తీక్, పర్షయ్య, వెంకటాచారి, శ్రీశైలం, రామకృష్ణ, లక్ష్మీనారాయణ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.


దుకాణాలు మూసివేసిన వ్యాపారులు


సిద్దిపేట అంబేద్కర్ చౌరస్తాలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజావాణికి 114 దరఖాస్తులు

సిద్దిపేట కల్చరల్/గజ్వేల్ అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ సమస్యలు పరిష్కారమవుతాయని నమ్మకంతో ప్రజావాణికి వస్తారని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన వారి నుంచి కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్లు గరిమా అగ్రవాల్, అబ్దుల్ హమీద్ లతో కలిసి వినతులను స్వీకరించారు. మొత్తం 114 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి వాటిని త్వరగా పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో నాగరాజమ్మ, ట్రైయినీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ప్రజావాణిలో వినతులను స్వీకరిస్తున్న అధికారులు

జిల్లా ఆసుపత్రి వైద్యులపై ఫిర్యాదు

గజ్వేల్‌లోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీజేపీ నాయకుడు, టెలికాం బోర్డు సభ్యుడు కమ్మరి శ్రీను సోమవారం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్‌కు ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల తీరు దయనీయంగా మారిందని, రోగులను గౌరవించకపోవడం, వైద్యులు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వైద్యులు తమ బాధ్యతను విస్మరించి, ప్రైవేటు ఆసుపత్రులకు రోగులను పంపిస్తూ కమీషన్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి, విచారణ బాధ్యతను డీఎంఅండ్‌హెచ్‌వోకు అప్పగించినట్లు తెలిపారు. ఆయన వెంట పట్టణ ప్రధాన కార్యదర్శి సందీప్ తదితరులున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

• కలెక్టర్ హైమావతి

నంగునూరు/కోహెడ అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట కలెక్టర్ కె.హైమావతి సోమవారం నంగునూరు, కోహెడ మండలాల్లో ఆకస్మిక పర్యటనలు చేపట్టారు. ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. నంగునూరు మండలం బద్దిపడగలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనంలో కేవలం పప్పు, బెండకాయ, సాంబారు, గుడ్డు మాత్రమే వండారని, కామన్ డైట్ మెనూలో భాగంగా మరో కూర ఎందుకు వండలేదని ప్రధానోపాధ్యాయురాలు పద్మపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నదే మధ్యాహ్న భోజన పథకం ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. వంటగదిలో వంట సరుకులు, చేసిన కూర, అలాగే భవనం పైనుంచి నీరు కారుతున్న అంశంపై నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హెచ్ఎం పద్మపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) శ్రీనివాసరెడ్డికి ఫోన్ ద్వారా ఆదేశించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్, వారితో ఆప్యాయంగా మాట్లాడారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. కోహెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. మలేరియా, డెంగ్యూ కేసులపైన ఆరా తీశారు. హాజరు, ఓపీ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అటెండర్ విధులకు హాజరు కాకపోవడంతో ప్రశ్నించగా, మెడిసిన్ కోసం సిద్దిపేటలోని స్టోర్‌కు వెళ్లినట్లు తెలిపారు. మెడిసిన్స్ ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చూడాలని డీఎంఅండ్‌హెచ్‌వోను ఫోన్ ద్వారా ఆదేశించారు. మండలంలోని శనిగరం గ్రామంలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు తెలిపారు. తేమశాతం రాగానే గన్ని బ్యాగులు అందజేయాలన్నారు.


విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్



అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్లు నిండకుండా వివాహం చేయడం చట్టరీత్యా నేరం. కానీ, ఈ నిబంధనలను జిల్లాలోని పలు గ్రామాల్లోని ప్రజలు పట్టించుకోవడం లేదు. తల్లిదండ్రుల అజ్ఞానం, ఆర్థిక భారం, అక్షరాస్యత లేమి.. ఇవన్నీ కలిసి చిన్నారులను పసి వయసులోనే పెళ్లి పీటలెక్కిస్తున్నాయి. సంసారం అంటే తెలియని ఆ లేత మనసులు 16 ఏళ్లకే తల్లులవుతూ.. అంతులేని అనారోగ్య సమస్యల సుడిగుండంలో చిక్కుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా గతేడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు అధికారులు ఏకంగా 24 బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. గజ్వేల్ మండలం అహ్మద్‌నగర్ గ్రామంలో ఆరునెలల్లో ఇక్కడ రెండు బాల్యవివాహాలను పోలీసులు అడ్డుకున్నారు. ఇక వెలుగులోకి రానివి అనేకం. కొన్ని ప్రాంతాల్లో చిన్నారుల ఆధార్ కార్డులో మార్పులు చేసి మరీ వివాహాలు కానిచ్చేస్తున్నారు.

\- గజ్వేల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి)

పుత్తడి బొమ్మకు పుస్తెల భారం!



• జిల్లాలో పెరుగుతున్న బాల్యవివాహాలు • అడ్డుకుంటున్న అధికారులు
• పసి వయసులోనే తల్లులవుతున్న బాలికలు
• 18 ఏళ్లకే అనారోగ్య సమస్యలు • అవగాహన కరువైన తల్లిదండ్రులు
• అందని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు

బాల్య వివాహాలు పలు అనర్థాలకు దారితీస్తాయని, చిన్నారులను అనారోగ్యం పాలు చేస్తాయని అధికారులు ఎంత మొత్తుకుంటున్నా ప్రజలు వినడం లేదు. తమ బిడ్డకు కనీసం 18 ఏళ్లు నిండకముందే పెళ్లి చేసి బరువు దించుకోవాలని భావిస్తున్నారు. గజ్వేల్‌కు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కాసెగుడిసెలు (అహ్మద్‌నగర్)ల్లో నివసిస్తున్న కొందరు ఆర్థిక ఇబ్బందులు, సామాజిక పోకడలు, పక్కింటి వారిని చూసి అనే రకరకాల కారణాలతో మైనర్లకు వివాహాలు చేసి వారి జీవితాలను అంధకారంలోకి నెడుతున్నారు.

అనారోగ్య సమస్యలు

మైనర్లకు పెళ్లిళ్లు చేయడం వలన వారి భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. ముఖ్యంగా, 16 ఏళ్లకే తల్లులవుతున్న బాలికలు అధిక సంఖ్యలో అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ చిన్న వయసులో గర్భం మోసే సామర్థ్యం లేకపోవడంతో గర్భస్రావాల అవకాశాలు పెరుగుతున్నాయి. ఒకవేళ గర్భం దాల్చినా తల్లీబిడ్డలకు ప్రాణాపాయం పొంచి ఉంటుంది. పోషకాహార లోపం, రక్తహీనత వంటి సమస్యలతో తక్కువ బరువుతో పుట్టే బిడ్డలు కూడా పెను ప్రమాదంలో పడుతున్నారు. చిన్నారి తల్లులు ఈ నష్టాన్ని గ్రహించలేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అంతేకాక, బాల్య వివాహాల కారణంగా మేజర్‌లు అయితేనే అందే "కల్యాణలక్ష్మి, షాదీముబారక్" వంటి ప్రభుత్వ పథకాలను కోల్పోతున్నారు. 15, 16 ఏళ్లకే వివాహాలు చేస్తూ చిన్నారుల జీవితాలను రెండు, మూడేళ్లు ముందుగానే పణంగా పెడుతున్నారు.

అడ్డుకుంటున్నా...

జిల్లావ్యాప్తంగా గతేడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు 24 బాల్యవివాహాలను అధికారులు అడ్డుకున్నారు. అయితే, అహ్మద్‌నగర్‌లో పరిస్థితి ఇంకా విషమంగా ఉంది. గజ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లి మధిర గ్రామమైన అహ్మద్‌నగర్‌లో గత ఆరు నెలల్లోనే రెండు బాల్య వివాహాలను అధికారులు అడ్డుకున్నారు. అయినా సరే, కొందరు ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి వివాహాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. మరికొందరైతే ఆధార్ కార్డులలో పుట్టిన తేదీని మార్చి అక్రమ వివాహాలు చేస్తున్న సంఘటనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి.

చట్టంపై అవగాహన శూన్యం

కాసెగుడిసెలు (అహ్మద్‌నగర్)లో మొత్తం 70 కుటుంబాలు ఉండగా, వారిలో అక్షరాస్యత చాలా తక్కువగా ఉంది. పలువురికి ఆధార్ కార్డులు సైతం లేవని సమాచారం. చిన్నతనంలో బాల్య వివాహాలు చేయడం వలన

మిగతా 8వ పేజీలో

సాయంకాలం.. సంధ్యా రాగం

• సొబగులు అద్దుకున్న ఆకాశం
• చేర్యాల పెద్దచెరువు వద్ద కనువిందు

సాయం సంధ్యావేళ సూర్యుడు వెదజల్లిన లేలేత కిరణాలు ఆకాశాన్ని అరుణమయం చేశాయి. భగభగమండే సూరీడు అస్తమించే సమయంలో సంధ్యాకిరణాలను పంచుతూ, లేత ఎరుపు రంగులో దర్శనమిచ్చాడు. విశాలమైన, నీలిమబ్బులతో కూడిన ఆకాశం ఒక్కసారిగా సిందూరం అద్దినట్లుగా అరుణకాంతులద్దుకుంది. చేర్యాల పట్టణంలోని పెద్దచెరువు వద్ద ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించిన చూపరులు పరవశించిపోయారు. ప్రకృతి రమణీయతకు దర్పణం పట్టిన ఈ దృశ్యం అందరినీ ఆకట్టుకుంది.

\- చేర్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి)



ధాన్యం కొనుగోలు
కేంద్రాలు ప్రారంభం
• రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు : అధికారులు
8

విద్యా సంస్థల్లో
డ్రైడే నిర్వహించాలి
8

ఆత్మహత్యకు కారణమైన
ఇద్దరి అరెస్ట్
6

ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని సందర్శించిన ఆస్కీ బృందం

గజ్వేల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్‌లోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని సోమవారం ఆస్కీ బృందం సభ్యులు పరిశీలించారు. ఆస్కీ(అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా-హైదరాబాద్) బృందం సభ్యులు డాక్టర్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రీకృత ల్యాబ్, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్కీ బృందం సభ్యులకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ స్వాగతం పలికి ఆసుపత్రిలోని పలు విభాగాల సేవలను గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఆర్ఎంవోలు, నర్సింగ్ సూపరింటెండెంట్, నర్సింగ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.


ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని సందర్శిస్తున్న ఆస్కీ బృందం సభ్యులు

దుబ్బాక ఆర్టీసీ డిపోను పూర్వస్థితికి తేవాలి

• ఆర్టీసీ చైర్మన్‌తో ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాక, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : దుబ్బాక ఆర్టీసీ డిపోను పూర్వ స్థితికి తేవాలని, ఆర్థికంగా మంచి ఫలితాలు సాధిస్తున్న డిపోను నిర్వీర్యం చేయొద్దని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో టీఎస్ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డికి ఈ మేరకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. దుబ్బాక బస్‌డిపోకు మంచి రూట్లు ఉన్నాయని, వాటిని రద్దుచేసి, డిపోను రాజకీయ కారణాలతో కుదించారన్నారు. 1996 సెప్టెంబరు 9న ప్రజల విరాళాలతో సుమారు 5 ఎకరాల స్థలాన్ని డిపో కోసం కేటాయించగా, 1998 ఆగస్టు 26న 54 బస్సులతో డిపో ప్రారంభమైందని తెలిపారు. ప్రారంభం నుంచి దుబ్బాక డిపో అత్యుత్తమ సేవలందిస్తూ, 137 మంది సిబ్బంది ప్రతిరోజు 14,014 కి.మీ. ప్రయాణం చేసి, రూ.8 లక్షల దినసరి ఆదాయం సాధించిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆర్టీసీ నష్టాల కారణంగా 2006 డిసెంబరు 31న డిపో మూసేసినా.. ప్రజలు, ప్రజాప్రతినిధుల నిరసనలతో వారం రోజుల్లోనే 10 బస్సులతో పునఃప్రారంభమైందని తెలిపారు. ప్రస్తుతం బస్సుల సంఖ్య 35కి పెరిగి, రాష్ట్రస్థాయిలో ఆదాయపరంగా ముందంజలో ఉన్న డిపోలల్లో దుబ్బాక డిపో ఒకటిగా నిలుస్తోందన్నారు. ఇటీవల 2025 రాఖీపౌర్ణమి సందర్భంగా రాష్ట్రంలో 8వ స్థానం, ఉమ్మడి జిల్లాలో 2వ స్థానం సాధించిందని గుర్తుచేశారు. దుబ్బాక డిపో నుంచి నిజామాబాద్, శ్రీశైలం, కరీంనగర్, వేములవాడ, ముస్తాబాద్, రామాయంపేట, దౌల్తాబాద్, చేగుంట, దొమ్మాట, యాదగిరిగుట్ట వంటి రూట్లలో కొత్త సర్వీసులు ప్రారంభించాల్సిందిగా ఎంపీ రఘునందన్‌రావు విజ్ఞప్తి చేశారు. దుబ్బాక డిపోకు కొత్త డీఎంను నియమించి, 60 బస్సులతో పూర్తిస్థాయిగా పునరుద్ధరణ చేపట్టాలని ఎండీ నాగిరెడ్డిని కోరారు. ఆయన వెంట నాయకులు వడ్లకొండ శ్రీధర్, వై.ప్రసాద్, నీటీ శ్రీనివాస్, దుబాయ్ శ్రీనివాస్, సుభాష్‌రెడ్డి ఉన్నారు.


నాగిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రఘునందన్‌రావు

ఆవు పొడిచి వృద్ధుడు మృతి


రాజయ్య(ఫైల్)

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆవు పొడిచి వృద్ధుడు మృతిచెందాడు. హుస్నాబాద్ మండలం మాలపల్లి గ్రామానికి చెందిన సొల్లు రాజయ్య(75) ఆదివారం సాయంత్రం గ్రామ పరిసర ప్రాంతంలో తన పాడిగేదెను మేపుతున్నాడు. అక్కడే ఒక ఆవు కూడా ఉన్నది. ఆవు దగ్గరికి వెళ్లిన రాజయ్యను కొమ్ముతో తొడల భాగంలో పొడిచింది. రాజయ్య అపస్మారక పరిస్థితిలో పడిపోగా గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేశారు. రాజయ్యను చికిత్స నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించేలోపే మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుడు భార్య బాలవ్వ ఫిర్యాదు మేరకు పంచనామా చేసి, పోస్టుమార్టానికి తరలించారు.

మొబైల్ షాపులో చోరీ



చోరీకి గురైన మొబైల్ షాపు

కొడిపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న మొబైల్ షాపులో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. గతంలో నాలుగుసార్లు దొంగతం చేశారు. షాపులో విలువైన వస్తువులతో పాటు కొన్ని మొబైల్ ఫోన్‌లు తీసుకెళ్లారు. షాపులో ఉన్న సీసీ కెమెరాలోని మెమోరికార్డుల ఆనవాళ్లు కనిపించకుండా తీసుకెళ్లారు. మండల కేంద్రంలోని ప్రధాన జాతీయ రహదారి 765డిపై పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న షాపులోనే దొంగతనం జరగడంతో పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి.

ఆత్మహత్యకు కారణమైన ఇద్దరి అరెస్ట్

● మనీ స్కీంలో చేర్పించి మోసం


సమావేశంలో మాట్లాడుతున్న సిద్దిపేట సీపీ విజయ్‌కుమార్

సిద్దిపేట క్రైం, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి): మనీ సర్క్యులేషన్ స్కీమ్‌లో చేర్పించి ఓ వ్యక్తి ఆత్మహత్యకు కారణమైన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ వెల్లడించారు. సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 9న వర్గల్ మండలం వేలుర్‌కు చెందిన బడుగు హరికృష్ణ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు ములుగు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా, ఆయన సూసైడ్ నోట్ లభించింది. ఆన్‌లైన్ బెట్టింగ్ లో పెద్దఎత్తున డబ్బు పోగొట్టుకున్నట్లు తేలింది. ఇందులో అతని తండ్రి నాగరాజు సుమారు రూ. 8 లక్షలు తీర్చాడు. ఇంకా అప్పు ఉండటంతో దానిని తీర్చేందుకు వ్యాపార మార్గాలు వెతుకుతుండగా, అదే గ్రామానికి చెందిన కాలువల మణికంఠ రెడ్డి పరిచయమయ్యాడు. తాను కొంత పెట్టుబడి పెట్టి అధిక మొత్తంలో లాభాలు సంపాదిస్తున్నానని, తనలాగే కొంత డబ్బు పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో డబ్బులు సంపాదించవచ్చని ఆశపెట్టాడు. మణికంఠ, అతని పెద్దనాన్న కుమార్తె అలేఖ్య కలిసి హరికృష్ణను హైదరాబాద్‌లోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి అక్కడ రూ. 4 లక్షలు తీసుకుని ఓ సంస్థలో మెంబర్‌షిప్ ఇప్పించారు. బిజినెస్ ప్రమోషన్‌లో భాగంగా ఓ ట్రిక్ కూపన్, ఓ చేతి గడియారం ఇచ్చారు. తర్వాత హరికృష్ణను ఇద్దరూ కలిసి పలు హోటళ్లలో జరిగే సెమినార్లకు తీసుకెళ్లారు. తన డబ్బులు తిరిగే వచ్చే మార్గం కనిపించకపోవడంతో మోసపోయినట్లు తెలుసుకున్న హరికృష్ణ మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు సూసైడ్ నోట్ ఆధారంగా విచారణ చేపట్టి మణికంఠ, అలేఖ్యలను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపించారు. నిందితులతో పాటు పలువురు క్యూనెట్, ఇతర స్కీముల్లో చేర్పించి మోసం చేస్తున్నారని, అలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీపీ తెలిపారు.

వేర్వేరు కారణాలతో ఐదుగురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సిద్దిపేట జిల్లాలోని ములుగు, మెదక్ జిల్లాలోని నిజాంపేట, కొడిపల్లి, చిన్నశంకరంపేట, శివ్వంపేట మండలాల్లో చోటు చేసుకున్నది.


అశ్వినీ(ఫైల్)

ములుగు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వివాహిత ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన ములుగు మండలం కొక్కొండ గ్రామంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది. దౌల్తాబాద్ మండలం కోనాపూర్ గ్రామానికి చెందిన తిప్పగాని మల్లాగౌడ్ పెద్ద కూతురు అశ్వినీ(26)కి 2019లో కొక్కొండ గ్రామానికి చెందిన గుంతటిపల్లి రవిగౌడ్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. భర్త, అత్త, మరిదులు తరచూ అశ్వినీతో గొడవ పడుతున్నారు. దీంతో మనస్తాపానికి గురైన అశ్వినీ ఆదివారం సాయంత్రం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సోమవారం తండ్రి మల్లాగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

కుమారుడి మృతిని తట్టుకోలేక..


జ్యోతి(ఫైల్)

నిజాంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కుమారుడి మృతి తట్టుకోలేక మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మెదక్ జిల్లా నిజాంపేటలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్నది. గ్రామానికి విభూతి జ్యోతి(41) బతుకుదెరువు కోసం మహబూబ్‌నగర్ జిల్లాకు కుటుంబంతో కలిసి వలస వెళ్లింది. అక్కడ కుమారుడు అనిల్(17) ఫిట్స్‌తో నెలరోజుల క్రితం ఓ వాగులో పడి మృతిచెందాడు. అప్పటి నుంచి బెంగ పెట్టుకున్న తల్లి సోమవారం సాయంత్రం నిజాంపేటలో ఎవరూ లేని సమయంలో ఇంట్లోని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త నర్సింలు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజేష్ తెలిపారు.

అప్పులు ఎక్కువై.. మనస్తాపానికి గురై..


నెల్లూరు వెంకటేశం (ఫైల్)

కొడిపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో ఒకరు ఉరేసుకుని ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కొడిపల్లి మండలం సలవత్‌పూర్ గ్రామానికి చెందిన నెల్లూరు వెంకటేశం(51) నాలుగేళ్ల క్రితం కూతురు వివాహం చేశాడు. దీంతో రూ.3 లక్షల అప్పులు అయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలని కొంతకాలంగా తీవ్ర మనోవేదనకు గురై ఆదివారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కొడిపల్లి ఎస్‌ఐ మురళి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిగత కారణాలతో యువకుడు..


యాదగిరి(ఫైల్)

చిన్నశంకరంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిగత కారణాలతో ఓ యువకుడు సోమవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి గ్రామానికి చెందిన రెడ్డి దుర్గాప్రసాద్(24) వ్యక్తిగత కారణాలతో ఒత్తిడిని భరించలేక ఆదివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపారు.

తల్లి మందలించిందని..


మహమ్మద్(ఫైల్)

శివ్వంపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై పని చేయకుండా జులాయిగా తిరుగుతున్నావని తల్లి మందలించడంతో ఓ కుమారుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గంగయ్యపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై మధుకర్‌రెడ్డి కథనం ప్రకారం.. గంగయ్యపల్లికి చెందిన ఎండీ చాంద్‌బీ భర్త పదేళ్ల క్రితం చనిపోయాడు. ముగ్గురు కుమారుల వివాహం కాగా, చిన్నకుమారుడు మహమ్మద్(25)తో కలిసి ఉంటోంది. అతను శభాష్‌పల్లి శివారులోని ఓ పరిశ్రమలో పని చేసేవాడు. కల్లుకు బానిసైన మహమ్మద్ పనికి వెళ్లకుండా జులాయిగా తిరుగుతుండటంతో తల్లి మందలించింది. దీంతో సోమవారం ఇంట్లోనే ఉరి వేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి


సందిల రాజు(ఫైల్)

మర్కుక్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందిన సంఘటన మర్కుక్, కల్హేర్, కొడిపల్లి మండలాల్లో చోటు చేసుకున్నది. మర్కుక్ మండలం పాములకుర్తి గ్రామానికి చెందిన బాలకృష్ణ(59) గ్రామం నుంచి గౌరారం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. గ్రామ శివారులోని కావేరి కంపెనీ కోల్డ్ స్టోరేజ్ వద్ద వెనక నుంచి వచ్చిన (టీఎస్ 13 ఎస్ 0666) నెంబరు గల కారు ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు మర్కుక్ ఎస్‌ఐ దామోదర్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..

కల్హేర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కల్హేర్ మండలం మహదేవ్‌పల్లి గ్రామానికి చెందిన సందిల రాజు(32) ఈ నెల 2న విజయదశమి నాడు అత్తగారి గ్రామమైన నారాయణఖేడ్ మండలం ర్యాకల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి శివుని కుచ్చ సమీపంలో 161వ జాతీయ రహదారిపై వాహనం అదుపు తప్పి కిందపడి తీవ్రగాయాల పాలయ్యాడు. తనంతట తనే పడిపోయాడా..? లేక ఏదైనా వాహనం ఢీకొట్టిందా.. అనే విషయం తెలియరాలేదు. తీవ్రంగా గాయపడిన రాజును హైవే అథారిటీ సిబ్బంది అంబులెన్స్‌లో నారాయణఖేడ్ ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు శేఖర్ సోమవారం కల్హేర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రహీంగూడలో ఒకరు..

కొడిపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదుపు తప్పి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. చిలప్‌చెడ్ మండలం రహీంగూడకు చెందిన జూల కిష్టయ్య(48) ఈనెల 1న కొడిపల్లి మండలంలోని సలవత్‌పూర్‌లో చేపలు అమ్మేందుకు తన టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్లి తిగిరి వస్తున్నాడు. మర్రిచెట్టుతండా సమీపంలో ఎక్సెల్ అదుపు తప్పి కిందపడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కొడిపల్లి ఎస్‌ఐ మురళి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి యువకుడి మృతి


రాజు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు

జగదేవపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : చెరువులో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటి మునిగి యువకుడు మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సర్దగాని రాజు(35) గ్రామంలోనే టెంట్‌హౌస్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తమ కులానికి చెందిన ఇద్దరి దశదినకర్మకు మహాసముద్రం చెరువు కట్టకు తలనీలాలు తీసుకునేందుకు వెళ్లాడు. తలనీలాలు తీసుకుని స్నానానికి చెరువులోకి దిగిన రాజు ప్రమాదవశాత్తు నీట మునిగాడు. వెంటనే కుటుంబసభ్యులు బయటకు తీసినా.. రాజు అప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా చేరుకొని కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు కూతుళ్లు విక్షిత, హాసిని, కుమారుడు నితిన్ ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు గల్లంతు


ఘనపూర్ ఆనకట్ట వద్ద గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు

కొల్చారం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి యువకుడు గల్లంతైన సంఘటన కొల్చారం మండలం ఘనపూర్ ఆనకట్ట వద్ద సోమవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన సురేష్(25) ఘనపూర్ ఆనకట్టకు వరద తగ్గడంతో చేపల వేటకు వెళ్లి వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో అదుపు తప్పి నదిలో పడిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. ఎస్‌ఐ మొయినుద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకుని ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం పట్టివేత


టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడిన బియ్యాన్ని పంచనామా చేస్తున్న ఆర్‌ఐ సాయిశ్రీకాంత్

టేక్మాల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం వాహనాన్ని టేక్మాల్ పోలీసులు సోమవారం ఉదయం పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి నుంచి పెద్దశంకరంపేటకు ట్రాలీ ఆటోలో సుమారు 20 క్వింటాళ్ల బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారం మేరకు బోడ్మట్‌పల్లి గ్రామ శివారులోని 161 జాతీయ రహదారిపై పోలీసులు పట్టుకుని, రెవెన్యూ సిబ్బందికి అప్పగించారు. ఆర్‌ఐ సాయిశ్రీకాంత్ పంచనామా నిర్వహించి, పాపన్నపేట గోదాంకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పాంబండంలో..

శివ్వంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పౌల్ట్రీఫాంలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్‌బియ్యాన్ని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. మండల పరిధిలోని పాంబండ గ్రామానికి చెందిన రేషన్ డీలర్ శేఖర్ రేషన్ బియ్యాన్ని పౌల్ట్రీఫాంలో అక్రమంగా నిల్వ ఉంచాడు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి, ఆరు క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు డీలర్ శేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.


పాంబండ పౌల్ట్రీఫాంలో పట్టుబడ్డ రేషన్ బియ్యం

కుక్కల దాడిలో మహిళకు గాయాలు


జిల్లా జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

మెదక్ కల్చరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మెదక్ మండల పరిధిలోని మక్తా భూపతిపూర్ గ్రామంలో గుమ్మాల శోభ(35) అనే మహిళపై, మరో ఇద్దరిపై వీధి కుక్కలు దాడిచేశాయి. దీంతో మహిళ చేతికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. గ్రామంలో వీధికుక్కలు ఎక్కడపడితే అక్కడ సంచరిస్తున్నాయని, కుక్కల బెడద తీవ్రంగా ఉందని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని కోరుతున్నారు.



శివంపేట మంజీర నది వంతెన వద్ద విఠల్‌గౌడ్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ప్రాణాలు కాపాడిన 'ఆంధ్రజ్యోతి' కథనం

- మంజీరా వంతెన సూసైడ్ స్పాట్‌గా మారిందని కథనం
- స్పందించి కానిస్టేబుళ్లను ఏర్పాటు చేసిన ఎస్పీ
- ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చిన ఒకరు
- కాపాడిన కాపలా సిబ్బంది

పుల్‌కల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మంజీరా వంతెన సూసైడ్‌స్పాట్‌గా మారిందని 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 11న ప్రచురితమైన కథనంతో స్పందించిన సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఏర్పాటు చేసిన కాపలా ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడింది. హైదరాబాద్‌లోని మల్లంపేటకు చెందిన విఠల్‌గౌడ్(37) అందోలు మండలం బ్రహ్మణపల్లికి వచ్చి డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు భార్యతో గొడవపడి ఆదివారం రాత్రి 8.50 గంటలకు ఆత్మహత్య చేసుకునేందుకు శివంపేట సమీపంలోని మంజీర నది వద్దకు వచ్చాడు. నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించాడు. అప్పటికే వంతెన వద్ద కాపలాగా ఉన్న కానిస్టేబుళ్ల వేణుగోపాలరావు, నర్సింహులు గమనించి అతనిని బైక్‌పై వెంబడించారు. అటుగా వస్తున్న మరికొందరి సహాయంతో విఠల్‌గౌడ్‌ను పట్టుకుని, ఆత్మహత్యాయత్నాన్ని అడ్డుకున్నారు. అతని వివరాలు తెలుసుకుని గ్రామ మాజీ ఉపసర్పంచ్ నర్సింలుకు అప్పగించారు. విఠల్‌గౌడ్‌ను రక్షించిన పోలీసులను గ్రామస్థులు అభినందించారు.

బస్సుల కోసం విద్యార్థుల రాస్తారోకో



అంబాజీపేట గ్రామంలోని మెదక్-చేగుంట రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు

చిన్నశంకరంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కళాశాలకు, పాఠశాల సమయానికి బస్సులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సమయానుకూలంగా నడపాలని చిన్నశంకరంపేట మండల పరిధి అంబాజీపేట గ్రామంలోని బస్టాప్ వద్ద విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమయానికి బస్సులు నడపకపోవడంతో కళాశాలకు, పాఠశాలకు వెళ్లలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 9 గంటలకు నడవాల్సిన బస్సులు 10.30 గంటలకు వేస్తున్నారని, అవికూడా సరిగ్గా రావడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి సమయానికి బస్సులు నడిపించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

నర్సాపూర్ ఏరియా ఆస్పత్రిలో ఆస్కీ బృందం సందర్శన

- సదుపాయాలు, సిబ్బంది, సౌకర్యాల తీరుపై ఆరా



నర్సాపూర్ ఆస్పత్రిని సందర్శించి సూపరింటెండెంట్‌తో వివరాలు తెలుసుకుంటున్న ఏఎస్‌సీఐ బృందం

నర్సాపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ ఏరియా ఆస్పత్రిని సోమవారం అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ(ఎఎస్‌సీఐ) బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆస్పత్రినిలో సదుపాయాలు, సౌకర్యాలతో పాటు సిబ్బంది, ఏఎన్ఎం సంఖ్యతో పాటు ఇతర పరిస్థితులను పరిశీలించి వస్తున్న రోగుల సంఖ్యతో పాటు ఇంకా అవసరమున్న సిబ్బందితో పాటు ఇతర సదుపాయల గురించి స్థానిక సూపరింటెండెంట్ డాక్టర్ పావనితో పాటు ఇతర డాక్టర్లు, సిబ్బందిని అడిగి తెలుసుకుని వెళ్లినట్లు తెలిపారు. నర్సాపూర్ ఆసుపత్రిలో మరింత మెరుగైన సేవలు అందించడానికి అవసరమైన వాటిని సమకూర్చడంలో భాగంగా ఈ బృందం వచ్చినట్లు సూపరిండెంట్ తెలిపారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి

- మెదక్ జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి

హవేళిఘణపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల్లో ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించాలని జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని డైట్ కళాశాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులకు డిజిటల్ లర్నింగ్ పుస్తకంపై ఆయన అవగాహన కల్పించారు. భౌతిక, రసాయనిక శాస్త్ర ఉపాధ్యాయులకు ఈ శిక్షణ ఉంటుందన్నారు.

- వసతి గృహాలపై కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- బిల్లులు రావడం లేదంటూ తలలు బాదుకుంటున్న అధికారులు
- విద్యార్థుల కొరతతో వసతిగృహాలు వెలవెల
- ఇప్పటికే నియోజకవర్గంలో నాలుగు హాస్టళ్ల మూసివేత



విద్యార్థులు లేక మూతపడిన మల్‌చెల్మ గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహం

సంక్షోభంలో సంక్షేమ హాస్టళ్లు

జహీరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం గురుకులాలకు పెద్దపీట వేయడంతో వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో కొనసాగుతున్న సంక్షేమ హాస్టళ్లు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న వసతి గృహాల నిర్వహణపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అందులో పనిచేసే సిబ్బంది పనితీరు అంతు బట్టని దిగా ఉన్నది. బిల్లులుసకాలంలో రావడం లేదని, అప్పులు చేస్తూ విద్యార్థులకు అవసరమైన సరుకులు తెస్తున్నామని వసతి గృహాల నిర్వాహకులు సాకు చూపుతు నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలలు, వసతి గృహాలపై నమ్మకం కొరవడడంతో కూలీ పనులు చేసుకునే నిరుపేదలు సైతం తమ పిల్లలను పట్టణ ప్రాంతాల్లో గల ప్రైవేట్ హాస్టళ్లకు, పాఠశాలలకు పంపిస్తున్నారు. దీంతో వసతి గృహాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గుతోంది. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు, వసతిగృహాల వార్డెన్లు తంటాలు పడుతున్నా ఆశించిన ఫలితం రావడం లేదు. వసతి గృహానికి సుమారు 3-4 కిలోమీటర్ల దూరంలోఉన్న నిరుపేద విద్యార్థులను చేర్పించుకోవాలనే నిబంధన వార్డెన్లకు సమస్యగా మారింది. విద్యార్థుల సంఖ్య లేని కారణంగా వసతి గృహాలను ఎత్తేసే పరిస్థితి ఏర్పడిందని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

వసతి గృహాలకు విద్యార్థుల కొరత

నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ బాలుర, బాలికలకు సంబంధించి 19 వసతి గృహాలున్నాయి. అందులో దిగ్వాల్, మల్‌చెల్మ, హద్నూర్, అసద్‌గంజ్‌లో గల నాలుగు హాస్టళ్లు మూతపడ్డాయి. ప్రస్తుతం 15 వసతి గృహాలు కొనసాగుతున్నాయి. ఆయా వసతి గృహాల్లో సుమారు 2 వేల పైచిలుకు విద్యార్థుల సంఖ్య ఉండాల్సి ఉంది. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 1000 దాటలేని పరిస్థితి నెలకొంది. ఒక్కో వసతి గృహంలో.. ఒక్కో తరహాలో విద్యార్థులసంఖ్య ఉంది. జహీరాబాద్, ఝరాసంగం, న్యాల్‌కల్‌లో ఐదు బీసీ బాలుర, బాలికల వసతి గృహాలు ఉన్నాయి. జహీరాబాద్‌లో పట్టణంలో మూడు వసతి గృహాలుండగా.. ఆయా వసతి గృహాల్లో సుమారు 600 మంది విద్యార్థులకు.. కేవలం 200 మందే ఉన్నారు. న్యాల్‌కల్‌లో 100 మందికిగాను 30 మంది, ఝరాసంగంలో 100 మందికిగాను 90 మంది విద్యార్థులున్నారు. అలాగే ఝరాసంగం, జహీరాబాద్, కోహీర్‌లో ఏడు ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలుండగా.. అందులో 1100 మంది విద్యార్థులకు.. కేవలం 500 మందే ఉన్నారు. జహీరాబాద్ పట్టణంలో 250 మందికిగాను 150 మంది, ఝరాసగంలో 220కిగాను 150, కోహీర్‌లో 300లకుగాను 113, పట్టణంలోని కళాశాల వసతి గృహాల్లో 227కుగాను 90 మంది విద్యార్థులున్నారు. జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లోగల ఎస్టీ వసతి గృహాల్లో 250 మంది విద్యార్థులకుగాను 100 మంది ఉన్నారు. ఆయా వసతి గృహాల్లో సంఖ్య తక్కువగా ఉన్నందున క్షేత్రస్థాయిలో ఆశించినతరహాలో స్పందనరాకపోవడంతో వసతి గృహాల వార్డెన్లకు తలనొప్పిగా మారింది. అందరూ గురుకులాల వైపు మొగ్గుచూపుతున్నారని పలువురు వార్డెన్లు స్పష్టం చేశారు.

నాలుగు వసతి గృహాల మూసివేత

విద్యార్థుల సంఖ్య లేని కారణంగా ఇప్పటికే నియోజకవర్గంలోని దిగ్వాల్, మల్‌చెల్మ, అసద్‌గంజ్, హద్నూర్ వసతి గృహాలను మూసివేశారు. అందులో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేసే సిబ్బందికి ఐదునెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహాల వార్డెన్లకు సైతం ఆరునెలలుగా బిల్లులు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మున్ముందు వీటిని కొనసాగిస్తారో.. లేదో అన్న అనుమానం అందులో పనిచేసే ఉద్యోగులను వెంటాడుతోంది.





శిథిలావస్థకు చేరిన పట్టణంలోని లతీఫ్ రోడ్‌లోగల బాలికల వసతి గృహం, వసతి గృహం లోపల శిథిలావస్థకు చేరిన భవనం దృశ్యం

దివ్యాంగుడి ఇంటికి అడ్డంకులు

- బెదిరింపులకు గురిచేస్తున్న కొందరు

కంది, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న కంది గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో దివ్యాంగుల ఇళ్ల నిర్మాణాలపై రియల్ దళారుల జులుం ప్రదర్శిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీనగర్ కాలనీలో దివ్యాంగుడు గద్దె శ్రీనివాసరావుకు 2003లో 100 గజాల ఇంటి స్థలాన్ని కేటాయిస్తూ అప్పటి అధికారులు సర్టిఫికెట్ జారీచేశారు. 2016లో రేకుల ఇళ్లు కట్టుకున్నాడు. అప్పటి నుంచి శ్రీనివాసరావు క్రమ తప్పకుండా ఇంటి పన్ను కట్టి కంది గ్రామపంచాయతీ నుంచి 2017లో ఓనర్‌షిప్ సర్టిఫికెట్ పొందాడు. అయితే 2019లో స్థానికులు కొందరు లక్ష్మీనగర్ కాలనీలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయని కొన్ని ఇళ్లను కూల్చివేశారు. అందులో శ్రీనివాసరావు ఇళ్లు కూడా ఉన్నది. అయితే తాను దివ్యాంగుడినని, తనకు ప్రభుత్వం ఇళ్ల పట్టా ఇచ్చిందని ఆధారాలు చూపించి.. అదే స్థలంలో కూడబెట్టుకున్న డబ్బులతో పాటు అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేపట్టాడు. అదే కాలనీలో రియల్ వ్యాపారం చేసే కొందరు తమకు ముడుపులు ఇవ్వకుంటే నిర్మాణం పూర్తి చేయనీయమని బెదిరింపులకు గురిచేస్తున్నారని తన బాధను 'ఆంధ్రజ్యోతి'కి చెప్పుకుని వాపోయాడు. ఇటీవల పంచాయతీ సిబ్బంది అన్ని అనుమతులు ఉన్నాగానీ మళ్లీ పర్మిషన్ తీసుకోవాలని నోటీసులు జారీ చేశారని ఆయన తెలిపాడు. ఉన్నతాధికారులు మానవతా దృక్పథంతో ఇళ్లు కట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశాడు.



తనకు కేటాయించిన సోమవారం స్థలం సర్టిఫికెట్‌ను చూపుతున్న దివ్యాంగుడు శ్రీనివాసరావు

బడిచుట్టూ మురుగునీరు

- డ్రైనేజీల నుంచి నేరుగా అక్కడికే..
- దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు

మనోహరాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని మురుగునీరంతా పాఠశాల చుట్టూ చేరడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు దుర్వాసన భరించలేకపోతున్నారు. మండలంలోని రంగయపల్లి శివారు జిల్లా పరిషత్ పాఠశాల భవనం ఉండగా, చెట్ల గౌరారం గ్రామానికి చెందిన డ్రైనేజీ నీరంతా పాఠశాల చుట్టూ చేరుతోంది. మూడు నెలలుగా పాఠశాల చుట్టూ మురుగు నీరు చేరి దోమలు పెరిగిపోయాయి. దీంతో తరగతి గదుల్లో విద్యార్థులు కూర్చోలేకపోతున్నారు. ఎలాగోలా కూర్చుదామనుకున్నా.. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం చేసే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ఈ పాఠశాలలో నాలుగు గ్రామాలకు చెందిన సుమారు 300 మంది విద్యార్థులు చదువుకుంటుండగా, చుట్టూ మురుగు నీరు చేరినా పట్టించుకునేవారు లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల చుట్టూ మురుగునీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంజీవరావు కోరుతున్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శిని సంప్రదించగా, అధికారులకు సమాచారం ఇస్తానని గ్రామస్థులు తెలిపారు. న్నారు.



రంగాయపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల చుట్టూ చేరిన మురుగు నీరు

ఆర్థిక భారాన్ని తగ్గించేందుకే ఇసుక బజార్

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు టీజీఎండీసీ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన ఇసుక బజార్ ద్వారా ఇసుక సరఫరా చేయనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం నర్సాపూర్ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన ఇసుక బజార్‌ను కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆకస్మికంగా తనిఖీచేసి సరఫరా అవుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ఉచితంగా ఇసుకను అందించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారులు కేవలం నల్గొండ నుంచి వస్తున్నందున ఇసుకకు ఇక్కడ మెట్రిక్ టన్నుకు రవాణా చార్జీ కింద రూ.1,200 చెల్లించి గ్రామ కార్యదర్శి నుంచి టోకెన్ తీసుకొస్తే ఇసుక ఇస్తారని చెప్పారు.



నర్సాపూర్‌లో ఇసుక బజార్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపక బృందం

కోహెడ అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్జీఎఫ్) ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడల్లో అండర్-17 బాలుర ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు కోహెడ మండలం వరుకోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి గండికోట అక్షయ్‌కుమార్ ఎంపికయ్యాడు. ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వ్యాయామ ఉపాధ్యాయుడు లేకపోయినా ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఫుట్‌బాల్ క్రీడను ప్రాక్టీసు చేసిన అక్షయ్‌కుమార్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు డి.కృష్ణవేణి, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణవేణి, ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, సంగు రామకృష్ణ, ఉపేందర్ పాల్గొన్నారు. అలాగే మెదక్‌లో నిర్వహించిన ఎస్జీఎఫ్ ఫుట్‌బాల్ పోటీల్లో సిద్దిపట జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ సంక్షేమ పాఠశాల, జూనియర్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పోటీల్లో పాల్గొన్న జీ.తేజ, ఎస్‌కె.రషీద్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అంతేకాకుండా జీ.తేజ ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కోఆర్డినేటర్లు రజిత, జీశాన్ అహమ్మద్, ఉపాధ్యాయులు బాబురావు, రంజిత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అథ్లెటిక్ పోటీలకు జ్ఞానేశ్వర్

దుబ్బాక/మిరుదొడ్డి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతారెడ్డిపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన చాకలి జ్ఞానేశ్వర్ ఎంపికయ్యాడని వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రవీణ్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. ఉమ్మడి మెదక్‌లోని అవుట్‌డోర్ స్టేడియంలో అండర్-17 విభాగంలో లాంగ్‌జంప్‌లో 5.41 మీటర్ల దూరం దూకి గోల్డ్‌మెడల్‌ను సాధించి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. కాగా జ్ఞానేశ్వర్‌ను ప్రధానోపాధ్యాయుడు మల్లేశం, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు దుబ్బాక సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సుజాత, పీఈటీ మహేష్‌లు తెలిపారు.

బాస్కెట్ బాల్ పోటీలకు..

చేగుంట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు చేగుంట ఎస్టీ గిరిజన బాలికల క్రీడా పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు కల్పన, విజ్ఞానేశ్వరి, గీత, అర్చన ఎంపికయ్యారు. త్వరలో హైదరాబాద్‌లో జరగబోయే పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు..

నారాయణఖేడ్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నారాయఖేడ్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఇర్ఫాన్, షాన్‌వాజ్, అజన్, ఫయజ్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గనపతి తెలిపారు. విద్యార్థులను గణపతితో పాటు ప్రధానోపాధ్యాయులు రాములు, పీఈటీ అజీజ్, సంతోష్, ధన్‌రాజ్ సిబ్బంది విద్యార్థులను అభినందించారు.



దుబ్బాక : రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

విద్యార్థి వివేక్ మృతిపై విచారణ చేపడుతాం

- ఈ విషయంపై మంత్రులతో మాట్లాడాం
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

హుస్నాబాద్‌రూరల్/నంగునూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డ సాంఘీక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఈనెల 7న ఎనిమిదవ తరగతి విద్యార్థి సనాదుల వివేక్ మృతిపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం జిల్లెలగడ్డ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. మృతుడు వివేక్ మృతి చాలా బాధాకరమన్నారు. ఘటనపై ఉపాధ్యాయులను, 12 మంది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ వంటగదులు, తరగతి గదులను పరిశీలించి మాట్లాడారు. ఈ ఘటనపై జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో, సాంఘీక సంక్షేమశాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్‌లతో మాట్లాడామన్నారు. గురుకుల పాఠశాలను సందర్శించి విచారణ చేసి సంఘటన వివరాలు తేవాలని కోరినట్లు తెలిపారు. విద్యార్థి మృతి సంఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సీపీ, కలెక్టర్‌ను ఆదేశించామన్నారు. విచారణ ఆఫీసర్‌గా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విజయభార్గవ్‌ను నియమించామని కలెక్టర్ హైమావతి చెప్పినట్లు వెల్లడించారు. విద్యార్థి మృతిపై హుస్నాబాద్ ఏసీపీ సదానందం, పోస్టుమార్టం రిపోర్ట్, విజయభార్గవ్ ఇచ్చే రిపోర్టుల ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. వివేక్ కుటుంబానికి న్యాయం చేకూర్చుతామన్నారు. ఆయన వెంట ఆర్డీవో రామ్మూర్తి, ఏసీపీ సదానందం, జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు, సాంస్కృతిక చైర్మన్ ఎలుక దేవయ్య, నియోజక వర్గ ఇన్‌చార్జి ఆరె కిషోర్, ఎలుక అంజనేయులు, జాల శ్రీనివాస్, గిరిప్రసాద్, కొంరయ్య, రమేష్, సాయిరామ్ ఉన్నారు. వివేక్ మృతిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం నంగునూరులోని విద్యార్థి తల్లిదండ్రులను పరామర్శించి మాట్లాడారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కె.లింగమూర్తి, కాంగ్రెస్ నాయకులు దేవులపల్లి యాదగిరి, మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు



గురుకుల పాఠశాలలో విలేకరులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కోహెడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలం కూరెళ్ళ గ్రామ సమీపంలోని మోయ తుమ్మెదవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాకర్లను సోమవారం పట్టుకున్నట్లు ఎస్సై అభిలాష్ తెలిపారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకనుతరలిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించారు. డ్రైవర్లు, ట్రాక్టర్ల యజమానులు కుంచెం అరవింద్, దున్నపోతుల మహేష్, బుర్ర రాకేశ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కపట ప్రేమ చూపిస్తున్న కేంద్ర మంత్రి

వర్గల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ల బిల్లుపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కపట ప్రేమ చూపిస్తున్నారని, బండి సంజయ్ స్పందించకపోవడం దురదృష్టకరమని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి ముదిరాజ్ అన్నారు. సోమవారం వర్గల్ మండలం గౌరారం వద్ద విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలను స్వాగతిస్తూనే గవర్నర్, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బీసీ రిజర్వేషన్ బిల్లు అమోదానికి వత్తిడి పెంచకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేయడం శుభపరిణామమన్నారు. బీసీ బిల్లును అడ్డుకుంటున్న ఆయా పార్టీలు చౌకబారు విమర్శలు మానుకొని బిల్లుకు కలిసికట్టుగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

పంటల నమోదు కార్యక్రమం

గజ్వేల్ రూరల్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం దిలాల్పూర్ గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ వద్ద పంటల నమోదు కార్యక్రమం జరుగుతుందని వ్యవసాయ విస్తరణ అధికారి మాధవి తెలిపారు. ప్రతి ఒక్క రైతు తమ పంట పొలాల్లో ఏ ఏ సర్వే నంబర్లో ఏ ఏ పంట వేశారో నమోదు చేసుకోవాలని మనవి లేని ఎడల పంట విక్రయ సమయంలో ఏ రైతు పంట అయితే వ్యవసాయ శాఖ పోర్టల్‌లో నమోదవుతుందో వారిది మాత్రమే కొనుగోలు చేస్తామన్నారు. ప్రతి ఒక్క రైతు తమ పంట విక్రయ సమయంలో ఇబ్బంది పడకుండా ఉండటం కోసం తప్పకుండా వారి పొలాల్లో ఏ ఏ పంటలు వేశారో నమోదు చేసుకోవాలని కోరారు

ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ప్రారంభం



దౌల్తాబాద్ : మండల కేంద్రంలో ఆగ్రోస్ 2 రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏవో సాయికిరణ్, నాయకులు

దౌల్తాబాద్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతుల మేలుకోసమే ఆగ్రోస్ 2 రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని ఏవో సాయికిరణ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని దిపాయంపల్లి రోడ్డులో మాజీద్ హుస్సేన్ నూతనంగా ఏర్పాటు చేసిన ఆగ్రోస్ 2 రైతు సేవ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సయ్యద్, రహీముద్దీన్, స్టీవెన్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ బుడ్డ రమేష్, సయ్యద్ ఖలీలోద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తు

చేర్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ముస్త్యాల మోడల్‌స్కూల్‌లో అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ప్రారంభమయ్యాయి. ఖాళీగా ఉన్న పీజీటీ పొలిటికల్ సైన్స్ అధ్యాపకపోస్టు ఖాళీగా ఉన్నందున గంటల ప్రాతిపదికన బోధన నిమిత్తం నియమించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.భిక్షం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, టెట్ క్వాలిఫై అయినవారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈనెల 15వతేదీలోగా మోడల్‌స్కూల్‌లో సంప్రదించాలని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రానైట్ విరాళం ఇచ్చిన హరీశ్‌రావు



శివాలయానికి వచ్చిన గ్రానైట్

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్సాన్‌పల్లి గ్రామ శివారులో నిర్మిస్తున్న శివాలయానికి మాజీమంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు 3000 ఫీట్స్ మూడు లక్షల విలువగల గ్రానైట్ అందించినట్లు గ్రామ ప్రజా ప్రతినిధులు తెలిపారు. గ్రామంలో నిర్మించిన శివాలయానికి గ్రానైట్ సహకారం అందించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావుకి ఆలయ నిర్వహకులు గ్రామస్థుల తరుపున మాజీ వైస్ ఎంపీపీ అల్లం ఎల్లం, మాజీ, రైతు బంధు మండల మాజీ అధ్యక్షుడు నిమ్మ జనార్ధన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగుల ప్రశాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ రవీందర్ గౌడ్ గ్రామ శాఖ అధ్యక్షులు కట్కూరి నరసయ్య, తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

దౌల్తాబాద్/సిద్దిపేట రూరల్/కొముురవెల్లి/చిన్నకోడూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్, సిద్దిపేట రూరల్, కొమురవెల్లి, చిన్నకోడూరు మండలాల్లో గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం అధికారులు ప్రాంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్ధతు ధర పొందాలని సూచించారు. కొమురవెల్లి మండల కేంద్రంతో పాటు అయినపూర్,కిష్టంపేట గ్రామాల్లో ఐకేపీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను సోమవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రారంభించారు.నారాయణరావుపేట మండలం జక్కాపూర్ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగిన నిధుల దుర్వియోగం పై విచరణ జరిపించాలని గ్రామస్థులు సిద్దిపేట కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.



కొముురవెల్లి మండలకేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



సిద్దిపేట: చిన్నకోడూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

విద్యా సంస్థల్లో డ్రైడే నిర్వహించాలి

- కలెక్టర్ కె. హైమావతి

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దోమలు వృద్ధి చెందకుండా అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో మంగళవారం ప్రత్యేక డ్రైడే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ.. వర్షాల ప్రభావంతో దోమలు అధికంగా వృద్ధిచెంది విద్యార్థులపై ప్రభావం చూపకుండా అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలలో పంచాయతీ, మున్సిపల్, వైద్యశాఖ సహకారంతో డ్రైడే నిర్వహించి నిలవనీటిని పారబోయాలన్నారు. అలాగే ఫాగింగ్ చేయాలని అన్నారు. జిల్లాలోని చాలా పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనంలో సాంబారుకు బదులు పచ్చిపులుసు పెడుతున్నారని, కచ్చితంగా మెనూ ప్రకారం ఆహారం అందించాలని ఆదేశించారు. వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలు కోతకు వచ్చాయని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని వసతులను సమకూర్చి కొనుగోలు సరిగా జరిగేలా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని అన్నారు. అదేవిధంగా పంటల వారీగా ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ కూడా త్వరగా పూర్తిచేయాలని అన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయంలో అర్టీఐ వారోత్సవాల నిర్వహించాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ వేగం పెంచాలని, నిర్మాణాలు పూర్తయిన సబ్ సెంటర్లు, పీహెచ్‌సీల ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, అబ్దుల్ హమీద్, డీఆర్‌వో నాగరాజమ్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

బీసీ వ్యతిరేక పార్టీలుగా మారిన ప్రతిపక్షాలు

దుబ్బాక, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): బీసీలకు న్యాయం చేయడం ప్రతిపక్షాలకు మింగుడుపడని వ్యవహారంగా మారిందని, దీంతోనే కోర్టులకు వెళ్లి, కేసులు వేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ బీసీసెల్ నాయకుడు మచ్చ శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన బీసీ సంఘం నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఏ నాయకుడు ఏ పార్టీ చేయని తెగింపు నిర్ణయాన్ని రేవంత్ రెడ్డి తీసుకున్నారని ఈ నిర్ణయాన్ని మింగుడు పడని కొన్ని అగ్రవర్ణ పార్టీలు, బీసీల నోటికాడబుక్కని లాక్కున్నాయని వారు అన్నారు. బీసీలను కేవలం ఓట్లు వేసి యంత్రాలుగానే రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు . బీసీలు 42 శాతం రిజర్వేషన్ కోసం మరింత బలంగా ఉద్యమించే లక్ష్యంతో ఈనెల 18న బంద్‌కు పిలుపునిచ్చారని ఆయన తెలిపారు. ఈనెల 18న జరిగే బంధుకు దుబ్బాక పట్టణంలో ఉన్న వ్యాపార వాణిజ్య విద్యాసంస్థలు సహకరించాలని పట్టణంలో ఉన్నటువంటి అన్ని బీసీ కుల సంఘాల నాయకులు బంద్‌లో పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని అన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

గజ్వేల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల సంఘం 2025-26వ సంవత్సర నూతన కార్యవర్గాన్ని ఆదివారం రాత్రి ఎన్నుకున్నారు. గజ్వేల్ పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా టి. నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా టి. రామకృష్ణారెడ్డి, ఫైనాన్సియల్ సెక్రెటరీగా ఆర్. మధుసూదన్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా దేవులపల్లి రాజారాం, ఉపాధ్యక్షుడిగా రాజేశం, మహిళా ఉపాధ్యక్షురాలిగా మేరీ అమృత, జాయింట్ సెక్రెటరీగా టి. జయసింహారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎం. యాదయ్య, ప్రచార కార్యదర్శిగా యండి జంషెడ్‌ఖాన్‌లను ఎన్నుకున్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

కొముురవెల్లి, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని గౌరాయపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్ది నర్సింహ్మారెడ్డి(57) తన పొలంలో పనులు చేస్తుండంగా పాముకాటు వేసింది. గమనించిన ఇరుగు పొరుగు రైతులు, కుటుంబ సభ్యులు చేర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు.మృతుడికి ఇదరు కుమారులు ఉన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా సేవలు చిరస్మరణీయం

గజ్వేల్ రూరల్ అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ సాయిబాబా సేవలు చిరస్మరణీయం అని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి అన్నారు. సాయిబాబా మరణించి సంవత్సరం అయిన సందర్భంగా సోమవారం గజ్వేల్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి డీబీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు, ఈ కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకుడు మైన స్వామి, దళిత మాజీ ఉపసర్పంచ్ రాజ్ కుమార్, డీబీఎఫ్ మండల అధ్యక్షులు ఉషగారి చంద్రం, క్యాసారం చంద్రం, సల్లా ఎల్లం, కాయితి స్వామి తదితరులు పాల్గొన్నారు.

సరైన పోషకాహారంతోనే తల్లీ, బిడ్డా సురక్షితం

కొముురవెల్లి/గజ్వేల్/నంగునూరు అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్, నంగునూరులో పోషక మాంసం కార్యక్రమం నిర్వహించారు. సరైన పోషకాహారంతోనే తల్లి, బిడ్డ సురక్షితంగా ఉంటారని జిల్లా సంక్షేమశాఖ అధికారి శారద అన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఐవోసీ కాంప్లెక్సులో సోమవారం నిర్వహించిన పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించగా, గజ్వేల్ ఆర్డీవో వీవీఎల్ చంద్రకళతో కలసి ముఖ్య అధితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం నిర్వహించిన అనంతరం అంగన్‌వాడీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను వారు పరిశీలించారు. నంగునూరు మండలం రాంపూర్ అంగన్‌వాడీ సెంటర్ లో ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వరూప ఆధ్వర్యంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.



పోషణమాసం కార్యక్రమంలో చిన్నారుల చేత అక్షరభాస్యం చేయిస్తున్న అధికారులు

కొముురవెల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో పోషణమాసం కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉమాదేవి అధ్వర్యంలో చిన్నారులకు అక్షరభ్యాసం,అన్నప్రాసన చేయించారు.

మక్కల దొంగల అరెస్ట్

మద్దూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మక్కల్ని దొంగతనం చేసిన ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. ఓ రైతు ఆరబోసుకున్న మక్కల్ని దొంగతనం చేసి ఆటోలో పారిపోతున్న ముగ్గురిని బ్లూకోల్ట్స్ సిబ్బంది వాహనాల తనిఖీలో పట్టుకున్నట్లు ఎస్సై షేక్ మహబూబ్ అలీ తెలిపారు. ఎస్సై సోమవారం తెలిపిన వివరాల ప్రకార.. ధూళిమిట్ట మండలం కూటిగల్ గ్రామానికి చెందిన అల్ల కొమురయ్య తను పండించిన మొక్కజొన్నను గ్రామ శివారులో గల జనిగెల వాగు బ్రిడ్జి వద్ద ఆరబోసుకున్నాడు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారని ఫిర్యాదు చేశాడు. సోమవారం ఉదయం గాగిళ్లాపూర్ చెరువు కట్ట సమీపంలో వాహనాల తనిఖీ చేపడుతుండగా ఆటోలో మొక్కజొన్న సంచులు ఉండటంతో పాటు అనుమానాస్పదంగా వ్యవహరించడంతో విచారించారు. హుస్నాబాద్‌కు చెందిన గంటల శంకర్, పండుగ సతీష్ , అక్కన్నపేట మండలం మల్లంపల్లికి చెందిన బడుగు సంపత్ అట్టి ధాన్యాన్ని కూటి గల్ శివారులో బ్రిడ్జి వద్ద దొంగతనం చేసి తీసుకువెళతున్నట్లు తెలిపారు. వీరిని అదుపులోకి తీసుకుని రిమాండ్ చేసి కోర్టుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చేర్యాల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాముని గోపాలస్వామి అన్నారు. చేర్యాల పట్టణంలోని వైశ్యభవన్‌లో సోమవారం జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వస్తువుల ఎగుమతి, దిగుమతి చేసే పనుల్లో ప్రధానపాత్ర వహిస్తున్న హమాలీ కార్మికులకు వెట్టిచాకిరికి గురవుతున్నా పాలకులు గుర్తించకపోవడం తగదన్నారు. ప్రమాద భీమా, పని భద్రత, గుర్తింపుకార్డులు, ప్రత్యేక పెన్షన్ సౌకర్యం కల్పించకపోవడంతో దుర్భర జీవితాలు గడుపుతున్నారన్నారు. అనంతరం లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయానికి వెళ్లి ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తాడు మామూళ్లను పెంచాలని వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు ఆముదాల మల్లా రెడ్డి, శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట్‌మావో, బండకింది అరుణ్, దప్పు కిషన్, ఎలుగు రవి, పిట్టల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల జేఏసీ సన్నాహక సమావేశం



మల్లన్న ఆలయంలో సన్నిధిలో సమావేశమైన ఉద్యోగులు,అర్చకులు

కొముురవెల్లి,అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల్లో పనిచేసే ఉద్యోగుల జేఏసీ ఏర్పాటు సన్నాహక సమావేశాన్ని సోమవారం మల్లన్న ఆలయ సన్నిధిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ కోచైర్మన్, రాష్ట్ర టీఎన్జీవో కార్యదర్శి ఉపాధ్యాయుడు చంద్రశేఖర్, ఆలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పడిగన్నగారి ఆంజనేయులు, ఏఈవో శ్రీనివాస్, ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు శ్రీరాములు, జూనియర్ అసిస్టెంట్లు మధుకర్, లక్ష్మీరాజం, నర్సింహ్మాలు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యసిద్ది ఆంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవం

గజ్వేల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని పాండవుల చెరువు కట్టపై గల శ్రీ కార్యసిద్ది ఆంజనేయ స్వామి దేవాలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు విఠాల సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించి, మూలవిరాట్‌కు అలంకరించారు.

రైతు బజార్ వద్ద కూరగాయల కొనుగోళ్లు

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలో రూ.3 కోట్లతో నిర్మించిన రైతు బజార్ సోమవారం అందుబాటులోకి తెచ్చారు. తాత్కాలికంగా హుస్నాబాద్ చావడి వద్ద నిర్మించిన రైతుబజార్‌లో కూరగాయల వ్యాపారులు కొనుగోళ్ల ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, చిత్తారి రవీందర్ కూరగాయల వ్యాపారులతో మాట్లాడి కొనుగోళ్లను పరిశీలించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2004-07బ్యాచ్ పూర్వ విద్యార్థులు 18 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో కలుసుకున్నారు. పట్టణంలోని స్థానిక ఎస్ఎస్ఆర్ బంకెట్ హాల్లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి, సరస్వతి మాత చిత్ర పటానికి పూజలు నిర్వహించారు. అనంతరం తమతో పాటు కలిసి చదువుకున్న వారిలో మరణించిన ముగ్గురు స్నేహితుల కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులు ఒకరినొకరు తమ జీవిత అనుభవాలను, కాలేజీలో ఆనాడు చదువున్న నాటి జ్ఞాపకాలను వేదిక మీద నుంచి పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ, తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా కలిసి తమలో ఎవరికి ఎటువంటి ఆపద వచ్చిన, అందరూ అండగా ఉండి సహాయ సహకారాలు అందించుకోవాలని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తమతో చదువున్న స్నేహితులు వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉండడం గర్వించదగ్గ విషయమన్నారు.

పుత్తడిబొమ్మకు.. పుస్తెల భారం!



(5వ పేజీ తరువాయి)

కలిగే నష్టాలపై వీరికి అవగాహన కల్పించేవారు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. బాల్య వివాహం చట్టరీత్యా నేరం. ఇక బాధ్యులకు గరిష్ఠంగా రెండేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా లేదా రెండు శిక్షలు అమలు చేసే అవకాశం ఉంది. అయితే, ఈ విషయాలు తెలియని తల్లిదండ్రులు తమ పిల్లల జీవితాలను ప్రమాదంలో పడేస్తున్నారు. అధికారులు చొరవ తీసుకుని గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు, కళాజాత ప్రదర్శనలు నిర్వహించి, బాల్య వివాహాలతో కలిగే నష్టాలు, చట్టపరమైన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రభుత్వం అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలకు చేరాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, కంప్యూటర్ కోర్స్ డైరెక్టర్ విజయగిరి బిక్షపతి పేర్కొన్నారు. సోమవారం హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బేసిక్ కంప్యూటర్ స్కిల్స్ సర్టిఫికెట్ కోర్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంపూటర్ కోర్స్‌లో చేరే విద్యార్థులు కంప్యూటర్ నైపణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవడం వల్ల ఉద్యోగ అవకాశాలను పొందగలవచ్చన్నారు. విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరు ఒక ఆశయాన్ని ఏర్పరచకుని దానికోసం నిరంతరం శ్రమ చేయడం వలన అనుకున్న లక్ష్యాన్ని సాధించగలమన్నారు. ఎమ్మెస్ వర్డ్, ఎంఎస్ ఎక్సెల్, ఎమ్మెస్ పవర్ పాయింట్, రెస్యూమే ప్రిపరేషన్ వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కోర్స్‌లో చేరే విద్యార్థులు రూ.300 చెల్లించి కంప్యూటర్ పరిజ్ఞానంపెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కరకపట్లలో నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు

మర్కుక్: అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మర్కుక్ మండల పరిధిలోని కరకపట్ల గ్రామ శివారులోని పారిశ్రామిక ప్రాంతంలో సోమవారం సాయంత్రం పోలీసులు నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఫ్యాక్టరీలలో, కార్మికుల నివాస ప్రాంతలలో, గ్రామంలో ఉన్న కిరాణా షాపులలో టీ కొట్టులు, ఇతర అనుమానాస్పద ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించడం జరిగిందనీ మర్కుక్ ఏఎస్సై రవీందర్ తెలిపారు. గంజాయి ఇతర మత్తుపదార్థాల నివారణ కోసం ఈ తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, డాగ్ స్క్వాడ్ సిబ్బంది అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



కరకపట్లలో నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు